కలంపోటు

శ్రీ కొవ్విడి రామం

"ఊరెయ్యది"

"చీపురుపలి"

"పేరో ?"

"సూరన"

"ఇంటిపేర్ "

"అడిదమువాగ్ "

"మీ రాజు ?"

"విజయరామ మహారాజు"

"అతడేమి సరసుడా ?"

"భోజుడయా"

"తమరేనా సూరకవిగారు. ఈ రోజు చాలా సుదినం. ఇదివరకు మీ పేరు వినడమేగాని మీ దర్శన భాగ్యం కలగడంలేదు. ఇదంతా ఒకపద్యం వరసలో ఉన్నట్టుంది.

సూరన: మీరు ఊరెయ్యది అని గ్రాంథికంలో ప్రశ్నించేరు గనుక, నేను కూడా పద్యపాదాల్లో నే జవాబిచ్చేను.

భుక్త: అగ్రహారం భుక్తలంబాబూ! పండించుకోడం. తినడం, వేదంముక్కలు వల్లించుకోడమేగాని మాకు కవిత్వాలూ కావ్యాలు తెలియవు అయితే యిదేం పద్యంబాబూ!

సూరకవి: పై సంభాషణ ఓ కందపద్యంలో పడిచింది.

భుక్త: చాలా సంతోషం! చీపురుపల్లిలో మా దూసికృష్ణుడు చదువుతున్నాడా ?

సూరకవి. దూసి కృష్ణుండు చదువంటే దుఃఖపడును.

భుక్త: బాబూ! ఆ మరపాకవా రబ్బాయో ?

సూరకవి: ధీరుడైనిల్చె మరపాక సూర, సుకవి.

భుక్త: బాబూ! తెలిసో తెలియకో మీతో స్వచ్ఛంగా మాటాడుదామని ఊరెయ్యది అని అడిగేను. అంతమాత్రాన మీ రిలా పద్యాల వర్షాలు కురిపిస్తే అర్థంచేసుకోడానికి నాతరమా! తమ రెక్కడినుండి దయచేస్తున్నారో చెప్పండి బాబూ!

సూరన: విజయనగరంనుంచి వస్తున్నాను.

భుక్త: ఏమిటిబాబూ-అక్కడి విశేషాలు?

సూరన: చాలా వున్నాయి. మొన్న విజయ దశమినాడు అక్కడ కోటకట్టడానికి శంకుస్థాపన చేసేరు. చుట్టుపక్కలున్న మన్నెదొరలలో చాలా మందిని ప్రభువువారు యుద్ధంచేసి లోబర్చుకున్నారు. ఆంధ్రజమీందారు మొదలైనవారు శ్రీవారి సఖ్యాన్ని అర్థించేరు. అందేత వారికి "మన్నెసుల్తాన్" అనే బిరు దాన్ని శంకరపీఠాధిపతులైన జగద్గురు సత్యజ్ఞానానంద స్వాములవారు ప్రసాదించేరు.

భుక్త: చాలా సంతోషం బాబూ! కాని మహా రాజు గారికీ పాయబుకీ మధ్య వ్యవహారం కొంత చెడిం దని అనుకుంటున్నారు. అదెంతమట్టుకు నిజం బాబూ!

సూరన: మన కెందుకయ్యా రాజకీయాలు?

* * * *

కాలచక్రం పరిభ్రమించింది. 1712 వ సంవ త్సరంలో విజయదశమినాడు శంకుస్థాపనచేసిన కోట "ఇంతింతై మరియింతయై మరియు దానంతై నభో వీధిపై అంతైన"వామనుని చందాన శోభాయమానంగా తయారయింది. అతి విశాలమైన ప్రాకారం, సర్వాంగ సుందరమైన మోతీమహలు, దానికి ముందుగా కట్ట బడిన నగారాఖానా, అన్నీ ఎంతో దివ్యంగా వున్నాయి. విజయనగరరాజులు ఉపయోగించే కవ చాలతోనూ, బాకులతోనూ, డాలులతోనూ ఆయుధా గారం నిండిపోయింది. ఒకనాటిరాత్రి శ్రీవారు ఏకాంతంగా ఆలోచనా మందిరంలో కూర్చున్నారు

వారి ఆసనానికి ముందున్న స్ఫటికశిలాఫలకంపైన ఏవో తాళపత్రాలు కనబడుతున్నాయి. శ్రీవారి దృష్టులు ఒకసారి ఆ తాళపత్రాలమీద మరొకసారి ఎదురుగా వున్న సింహద్వారంవైపు ప్రసరిస్తున్నాయి

అప్పుడే ఆ రాత్రి పన్నెండు గంటల నగారా ఆగింది. నిద్రాదేవి ప్రజలందరినీ స్వప్నలోకంలోకి తీసుకుపోయింది. కోటలో మాత్రం అక్కడక్కడా 'పారాహుషార్' అనే కేకలు వినబడుతున్నాయి. మేలిముసుగు వేసుకున్న ఒక వ్యక్తి స్వారీచేస్తూ రెండవ దేవిడీవరకూ వచ్చేడు. పారా సిపాయికి అతనేదో ఒక ఆజ్ఞాపత్రం చూపించి త్వరితగతిని యింకా ముందుకు సాగిపోయేడు. క్షణంలోనే గుఱ్ఱందిగి నిశ్శబ్దంగా మేడమెట్లెక్కి ప్రభువువారి సన్నిధిని తలవంచి, చేతులు జోడించి పక్కగా నిలబడ్డాడు. అతని హావభావ విలాసాలను సులువుగా పోల్చుకోడానికి వీలులేకుండా వుంది. రహస్యమైన రాజకీయ వ్యవహారాలలో నిమగ్నుడైన వ్యక్తిలా కనబడుతున్నాడు. మాటలతో పరిస్థితిని చెప్పలేక, తను రహస్యంగా దాచియుంచిన ఒకజాబును ఏలినవారి కందించేడు. మహారాజులుంగారా లేఖను చిత్తగించి కొంతసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయేరు.

రాజు : ఈ బాదుల్లాఖాన్ యెవడయ్యా ?

ముసుగుమనిషి : చిత్తం ! మనవి చేసుకుంటున్నాను. సన్న 1156 వ ఫసలీ, 1746 సం॥ లో జఫరల్లీకి అనువజుగా యితనిని నిజాము శ్రీకాకుళం సర్కారుకు నమోజు చేసేడు- మనిషి చాలాక్రూరుడు- జమాబందీలోగాని పేష్కష్ వసూలు చెయ్యడంలోగాని రవంతయినా అనుభవం లేదు- ఉర్దూ చదవడం, రాయడం రాదు- తెలుగు తెలియదు. జోరీగలు ముసరిన గొడ్డులాగుంటాడు-

రాజు: మన ద్విభాషి జరిగిన సంగతంతా చెప్పలేదూ!

ముసుగుమనిషి: మనద్విభాషి ఉన్న సంగతులన్నీ పూసగ్రుచ్చినట్టు చెప్పేడు. ఆసంగతులన్నీ వింటే ఉక్కుకన్నా కఠినమైన గుండె అయినా నీటికన్న పల్చగా ద్రవించి ప్రవించివుండును-మూడు సంవత్సరాలు వర్షాలు పూర్తిగా ఎత్తిగట్టేసేయని, దేశంలో క్షామదేవత తాండవం చేస్తోందని, యిటువంటి పరిస్థితులలో ప్రస్తుతం వున్న పేష్కష్ చెల్లించడమే కష్టంగా వుంటే దాన్ని రెండింతలు చేయడం కేవలం అన్యాయమని మన ద్విభాషి యెన్నోవిధాల నచ్చజెప్పేడు. కాని లాభం లేకపోయింది-

రాజు: అసలు సంగతి కనిపెట్టావూ!

ముసుగుమనిషి: ఏలినవారే సెలవియ్యాలి.

రాజు: జఫరల్లీ వున్న దగ్గర్నుంచి వాళ్ళకీ మనకీ వ్యవహారం రగుల్తూనే వుంది - ఫ్రెంచి సేనాని బుస్సీకి మనయెడల ఎక్కువ మోజుగా వుందని మన చుట్టుప్రక్కలవున్న మన్నెదొరలసహాయంతోనూ, బుస్సీ ప్రోద్బలంతోనూ, నిజాము మీదకే ఎదురుతిరుగుతామేమో అన్నభయం వాళ్ళందరికీ వున్నది. అందుచేత మన ఐశ్వర్యంలో చాలాభాగం నజరానాల మూలంగానూ పేష్కష్ మూలంగానూ రాబట్టాలని ప్రయత్నిస్తున్నారు- ఇంతేకాదు- కొంతమంది నిజాము మనుషులు మారువేషాలతో పల్లెలలో ప్రవేశించి మన చహరాలు తీస్తున్నారు- మన హవల్దారు భీమసింగు ఆ బాపతు మనుష్యుల్నిద్దరిని అప్పుడే పట్టుకున్నాడు- దానికి సంబంధించిన కాగితాలే ఆ బల్లమీద వున్నాయి-

ముసుగు మనిషి: అయితే యిది రాజకీయ పుటెత్తే!

రాజు : అంగుకభ్యం తరమా ?

ముసుగు మనిషి : ఐతే యిప్పుడేమిటి బాబూ కర్తవ్యం ?

రాజు : కర్తవ్యానికేముంది ? సామ దాన భేద దండోపాయాలు ఉండనే వున్నాయికదూ !

ముసుగుమనిషి: సామానికి లొంగేగ్రహాలా అవి?

రాజు: అయితే దండానికే లొంగుతాయి- 'దండం దశగుణంభవేత్'

ముసుగుమనిషి: ముసుగుతీసి బాకు చూపిస్తూ వికటాట్టహాసం చేస్తాడు-'రామరాజ్! ఈడు జఫరలీ కాదు-బాదుల్లాఖాన్-ఈడంటే పిట్టలు నీళ్లుతాగవ్- నీదండం—గిండం యిక్కడ పనికిరాదు ఈ బాకు నీ రక్తాన్ని రుచిమాసివుండును-కాని మా బాదుల్లా యుద్ధంలో నీ తలకాయి యెగరగొట్టి నిజాముప్రభువుకి నజరానాగా ఇస్తానన్నాడు-అందుచేత తిరిగి బాకు

ఒరలోకి దిగుతోంది"—అని ఆ ముసుగుమనిషి ఆనిశి రాత్రి మాయమైపోయేడు.

విజయరామరాజు గారు దిగ్భ్రమ చెందేరు-ఆయన కళ్లనే ఆయన నమ్మలేకపోయేరు-ఎంత మోసం జరిగింది? చారుని వేషంలో పరాయివాడు తన కళ్ళల్లోనే దుమ్ముకొట్టేడు- గుట్టు తీసుకుని పారిపోయాడు- ఇంతలో, తను అంతవరకు ఎదురుచూస్తున్న బద్దన్న వచ్చేడు.

రాజు : ఎవరది ? బద్దన్నా !

బద్దన్న : చిత్తం ప్రభూ !

రాజు : (గంభీరంగా) ఏమిటి విశేషాలు ?

బద్దన్న : ప్రభువులకి తెలియని విశేషాలేమిటి వున్నాయ్ బాబూ ! నా కన్నముందర నా వేషంలో పగవాడి దూత తమతోనే పరిహాసం చేసేడు. శ్రీకాకుళంలో యెక్కడచూసినా సాయబుల యుద్ధసన్నాహాలే కనిపిస్తున్నాయి. పరిస్థితి శ్రుతిమించి రాగాన పడింది.

రాజు : సరే నువ్వెళ్లు !

మర్నాడు మచ్చకొండమీనుంచి ఉదయభానుడు తొంగిచూస్తున్నాడు అయ్యకోనేటికి నీళ్లకు వచ్చిన అమ్మలక్కలు గతరాత్రి కోటలో జరిగిన గలాటాగురించి కథలు గాథలుగా చెప్పుకుంటున్నారు. బొంకుల దిబ్బమీదనున్న బండివాడి మొదలు రాజమహలులో పనిచేసే ఉన్నతోద్యోగివరకు విజయనగర రాజ్యానికి సంబంధించిన రాజకీయాలనే ముచ్చటించుకుంటున్నారు.

*   *   *

ఒకరు : బాబూ నిజమేనా !

రెండవవారు : ఇలాంటివి నిజంగాక అబద్ధమూతాయండీ ! ఊరంతా కోడై కూస్తూవుంటే యింకా నమ్మనంటావేమయ్యా ! అసలు ప్రభువారే రణస్థలంనుంచి తిరోగమిస్తున్నారు.

ఇంకొకరు : ఎంత దుర్దినం !

ఒకరు : మెల్లిగా అంటావేమిటి ! ఘాతంతో పాటు యింకొక అరిష్టం. ఈ ప్రాంతాలలోకల్లా చెప్ప గలిగిన మొనగాడు మన రాజుగారే. ఆయనే తలవంచితే యిక బాదుల్లాకు పట్టపగ్గాలుంటాయా !

ఇంకొకరు : అవిగో ! అవి మన సర్దార్ల గుర్రాల లాగ వున్నాయి. వాటి వెనక ప్రభువారుకూడా వున్నట్టున్నారు.

ఉదయం పది గంటలసమయం. ఎవ్వరి ముఖానా కత్తివేస్తే నెత్తురులేదు. గోడమీద చిత్తరువులలాగ సేవకులు రాజబంధువులు, ఉద్యోగులు నిశ్శబ్దంగా వున్నారు. ప్రభువులు నెమ్మదిగా మెట్లెక్కి రాజమహలు ప్రవేశించేరు. వందిమాగధులు లాంఛనప్రకారం జయవిజయీభవ, దిగ్విజయీభవ, మన్నెసుల్తాన్ అని యేమేమో చెప్పబోతున్నారు. రాజుగారు పళ్లు పటపట కొరికి వారివైపు ఎర్రగా చూసేరు. ఏదో గట్టిగా చెప్పాలనుకుంటున్నారు కాని, ఆయన్నావేశించిన ఆగ్రహం ఆ మాటను పైకి రానీయలేదు. 'హుం' అనే సింహగర్జన వంటి కఠోర గంభీరమైన ధ్వని ఆయన గళంలోనుంచి వెలువడింది. సభ్యులంతా భయకంపితులైనారు. ఆయన అనుచరవర్గం అంతా గడగడలాడిపోతున్నారు- ఎవరేం చేయాలో ఎవరికీ తెలియకుండాపోయింది- ఆ సమయాన ఒక మూల కూర్చున్న నూరకవి కొంచెం ముందుకు వచ్చేడు. ఆ క్రొవ్వాడి కోరమీసం, విశాలమైన ఫాలభాగం, ఒరలోని గంటం ఒక వైపు రాజఠీవిని మరొక వైపు పాండిత్య ప్రతిభనూ ప్రదర్శిస్తున్నాయి- నూరకవి సభ్యుల హృదయాలకి ముళ్ళుకన్నా వాడిగా గ్రుచ్చుకునేటట్లుగా—

గీ. మెత్తనైనట్టి యరటాకు మీదగాక
మంటమీదను చెల్లునే మంటవాడి
బీదలైనట్టి సరదార్ల మీదగాక
కలదె క్రొవ్వాడి బాదుల్లఖానుమీద ?

సీ. గరిడీలలోపల గంతు వేయుటకేమి
ఈటెబట్టి యరిపై దాటవలెను
సొగసుగ మొలకత్తి బిగియ జెక్కుటకేమి
వెలవక వైరుల నఱకవలెను
మాటి మాటికి పెద్ద మాటలాడుటకేమి
యవలించి రిపుల జెండాడవలెను
బొమ్మన నెఱ్ఱగంధమ్ము బూయుటకేమి
గాయంపు నెత్తురుల్ గ్రమ్మవలెను

గీ. గాని లేకున్న సత్కీర్తి కాంతగలదె ?
పూసపాటి కులాంభోధి పూర్ణసోమ
సమర జయభీమ గజపతి సార్వభౌమ
విమల సద్గుణధామ శ్రీ విజయరామ !

ఆ పద్యాలు సభ్యుల చెవుల్లో పిడుగులు పడ్డట్టుగా పడ్డాయి- అవనత శిరస్కులైన భటులందరూ కత్తులూ, యీటెలూ సర్దుకోడం ప్రారంభించేరు- ఉత్తర క్షణంలో ఏం జరిగేదీ పరమేశ్వరుడికీ, భావి కాలానికీ మాత్రమే తెలుసును- రాజుగారి ఉష్ణీషం స్వేద బిందువులతో చెమ్మగిల్లింది- చెక్కిళ్లు కెంపు బారేయి- కళ్ళు అగ్నివర్షం కురిసినట్లుగా ఉన్నాయి- 'అవధార్' అని ఉరుము ఉరిమినట్లుగా కేక పెట్టేరు- ఆ గర్జనతో కోటంతా దద్దరిల్లిపోయింది—'విజయమో వీరస్వర్గమో, మళ్ళండి రణస్థలానికి' అనే గంభీర వాక్కులు శ్రీ వారి గళసీమ నుండి వెలువడ్డాయి- ఒక్క క్షణంలో సేవాహిని పట్టపగ్గాలు లేకుండా రణస్థలం వైపు నడిచింది. నగారాఖానాలో జయభేరి మారు మ్రోగింది. సభ్యులంతా సూరకవి వేపు తెల్లబోయి చూసేరు. అతనిది సాహస కృత్యమని, రాజును నిండు సభలో గర్హించడం అనుచిత కార్యమని కొందరు విమర్శించేరు. కత్తిపోటు కన్న కలంపోటు బలీయమయినదని సూరకవి యీనాటికి నిరూపించగలిగేడని మరికొందరు మెచ్చుకున్నారు. లోకంలో అనేక రకాల భావాలు గలవాళ్లుంటారు. వాళ్ళందర్నీ మెప్పించడం యెవరి తరం? సూరకవి మారు మాటాడలేదు. శ్రీ వారు యుద్ధభూమికి తరలి వెళ్ళగానే మౌనముద్ర అతని ముఖాన ఆవరించింది. ప్రభువుల జయసిద్ధికోసం తన యిష్టదైవమైన రామచంద్రమూర్తిని ప్రార్థిస్తూ కాలం గడుపుతున్నాడు.

వారంరోజులు కాలగర్భంలో లీనమయిపోయేయి. రణస్థలంనుంచి వచ్చే వార్తలకోసం ప్రజలంతా ఉద్విగ్నులౌతున్నారు. ఏక్షణంలో ఏం సంభవిస్తుందోనని ప్రముఖులైన రాజోద్యోగులందరూ ఎక్కువ ఆత్రుతతో పరిస్థితిని గమనిస్తున్నారు. ఆనాటి మధ్యాహ్నం రెండు బాకుల చిహ్నాంగల విజయనగర రాజుల పతాకాన్ని విజయసూచకంగా ఎగుర వేస్తూ ప్రతీహారి తొందరగా సింహద్వారంవైపు వస్తున్నాడు. అతని మందస్మితం, ఉత్సాహ పరిప్లుతమైన ముఖం విజయవార్తను అతని కన్నముందే చెప్తున్నాయి:

నాటిసాయంకాలం శ్రీవారు బాదుల్లాఖానుపైన సాధించిన విజయాన్ని అభినందించడానికి గాను ప్రత్యేకమైన సభ ఏర్పాటు చేయబడింది. సభకు పుర ప్రముఖులు, పండితులు, రాజోద్యోగులు మొదలైనవారంతా వచ్చేరు — రంగవల్లికలతో, ఆకుపచ్చని తోరణములతో, సువాసినుల మంగళహారతులతో, శ్రావ్యమైన మంగళవాయిద్యాలతో సభామందిరం విజయశ్రీకి ఆలవాలమైవుంది— శ్రీ విజయరామ మహారాజులుంగారు సింహాసనాన్ని అధిష్ఠించేరు- ఆంధ్ర మొదలైన మన్నెజమీల అధిపతులు ప్రభువు సన్నిధిని ఉచితాసనాలలో ఆసీనులయ్యేరు- దర్బారులోని సంస్కృత పండితులు శ్రీ వారికి గీర్వాణభాషలో సన్మానపత్రం సమర్పించారు-

అనంతరం ప్రభువువారు లేచి యీ విధంగా ప్రసంగించేరు- "మీరందరూ మా రాజవంశీయుల యెడల చూపిన ఆదరభావానికి చాలా సంతోషం- ఇది కేవలం నేను వ్యక్తిగతంగా సాధించిన విజయం మాత్రమే గాదు- ఇది ధర్మం అధర్మంపైన సాధించిన విజయం; విజ్ఞత మూర్ఖత్వంపైని సాధించిన విజయం; పౌరుషం దురహంకారంపైన సాధించిన విజయం; దేశాన్ని కిరాతులైన దుష్ట ప్రభువుల బారినుండి తప్పించే ప్రయత్నంలో మన సేనావాహిని కృతకృత్యురాలయింది- కాని ఆ సేనావాహినికే జీవం పోసి ఆపత్సమయంలో దివ్యజ్యోతిని చూపించిన మహామహుడు, మీలోనే నిరాడంబరముగా అమూల కూర్చున్నాడు-ఆనాటి సూరకవి వాక్కులే బాదుల్లాఖానుని ఓడించడానికి నిశితమైన శరాలకంటె కోటి రెట్లు ఎక్కువగా పనిచేశాయి. మొదట నేను కత్తిపోటుతో సాధించలేని విజయం సూరకవి కలంపోటు మూలంగా సాధించగలిగేడు- నేను విజయశ్రీని చేపట్టడానికి కారకుడు ఆ సూరకవి. కనుక ఆయన యీ అర్ధాసనాన్ని అలంకరించాలి" అని ప్రభువులు తిరిగి సింహాసనంమీద కూర్చున్నారు-సూరకవి చిరునవ్వుతో లేచి

శా॥ ఢిల్లీలోపల గోలకొండపురి నిం
డెన్ నీ ప్రశంసల్ గురాల్
బల్లాలం బోడిపించి హుమ్మని యర
బ్బానెక్కి పైకొంచు బా
దుల్లాఖానుని బారద్రోలితివి నీ
దోశ్శక్తి సూబాలకున్
మళ్ళింపం దరమా నె శ్రీ విజయ రా
మా మండలాధీశ్వరా!

అని ప్రభువును ఆశీర్వదించాడు. దర్బారు గాయకుల శ్రవణపేయమైన వీణావాద్యంతో నాటి సభ జయప్రదంగా ముగిసింది.